## అక్రమ మద్యం, నాటుసారా నిర్మూలనకు కృషి చేయండి

**– జిల్లా కలెక్టర్ గిరీష పీఎస్**



**రాయచోటి, అక్టోబరు 25, ప్రభాతవార్త**

జిల్లాకు అక్రమ మద్యం, నాటు సారా నిర్మూలనకు సమన్వయంగా కృషి చేయాలని కలెక్టర్ గిరీష పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ శాఖ అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో గవర్నమెంట్ రిటలైల్ ఔట్‌లెట్ షాపులు ఎన్ని బార్లున్నాయి. వాటి ద్వారా గత సంవత్సరం, ఈ సంవత్సరం రెవెన్యూ ఎంత అనే విషయాలపై కలెక్టరు అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఉన్న 19 గవర్నమెంట్ రిటైల్ అవుట్ లెట్ షాపులలో సేల్స్ తక్కువగా ఉన్న షాపులను రివ్యూ చేసి ప్రభుత్వ ఆదాయం పెంచేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో అక్రమ మద్యం, నాటుసారా నిర్మూలనకు ఎన్‌ఫోర్స్‌మెంట్ కృషి చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్సీబీ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి.శ్రీనివాసులు, ఎక్సైజ్‌శాఖ ఇన్‌స్పెక్టర్లు చంద్రహాస్, మనోహర్, వాసుదేవచౌదరి, ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ నాగమనమ్మ పాల్గొన్నారు.


# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

గురువారం 26 అక్టోబర్ 2023


## కుటుంబ కలహాలతో కార్పెంటర్ ఆత్మహత్య



**మదనపల్లెక్రైం, అక్టోబర్ 25 ప్రభాతవార్త:**

కుటుంబ కలహాలతో కార్పెంట్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం రాత్రి మదన పల్లెలో చోటు చేసుకొంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా వున్నాయి. కలికిరి మండలం మేడికుర్తి పంచాయితీ ఆసాదివారి పల్లెకు చెందిన లేట్ రెడ్డప్ప కుమారుడు రాజేష్(23) కార్పెంటర్‌గా పని చేస్తున్నాడు. ఆరునెలల క్రితం ఇదే ప్రాంతానికి చెందిన వైష్ణవిని వివాహం చేసుకొని మదనపల్లె లోని బసినికొండకు వచ్చారు. అయితే భార్య ప్రవర్తన సరిగా లేకపోవడంతో తరచూ ఘర్షణ పడేవారు. మంగళవారం రాత్రి మద్యం సేవించి రాజేష్ రావడంతో తిరిగి బార్యభర్తల మద్య వాగ్వివాదాలు జరిగాయి. దీంతో రాజేష్ ఇంటిలో గడియపెట్టుకొని ప్యానుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య గమనించి కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకొని తాలూకా పోలీసులకు సమా చారం ఇవ్వడంతో పోలీసుల వచ్చి చూడగా అప్పటికే రాజేష్ మృతిచెందాడు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పంచనామ నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

# మృత్యువులోనూ వీడని స్నేహబంధం

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం

**రాజుపాళెం, అక్టోబర్25, ప్రభాతవార్త**



మండల పరిధిలోని కొర్రపాడు గ్రామ సమీపంలో బుధవారం సాయంత్రం చీకటి పడుతున్న సమయంలో ఆగిఉన్న ట్రిప్పర్‌ను డీకొన్న మోటారు సైకిల్ అందులో ప్రయాణిస్తున్న యువకులు ఇద్దరు యువకులు అక్కడికి అక్కడే మృతి చెందారు. మృతులు ఇరువురు రాజుపాళెం గ్రామానికి చెందిన మస్తాన్‌రెడ్డి (19), అల్తాఫ్(18)గా గుర్తించారు. రాజుపాళెం నుండి ప్రొద్దుటూరుకు మోటారు సైకిల్ లో స్నేహితులు ఇద్దరు వెళ్ళుతుండగా ఈ ప్రమాదం జరిగినది. ఈ విషయమై యస్ఐ రాజగోపాల్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి. నంద్యాల శ్రీనివాసుల రెడ్డి దంపతులకు మస్తాన్‌రెడ్డి ఒక్కగానొక్క కొడుకు. బంగ్లా అబ్దుల్‌కు ముగ్గురు కొడుకులలో చివరి వాడు అల్తాఫ్ . వీరిద్దరూ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందటం అందరిని కలసివేసినది. మంగళ వారం సాయంత్రం నుండి రోడ్డు పైనే ఆగి ఉన్నది ఈ ట్రిప్పరు. ఈట్రిప్పర్ కుందూనది మట్టిని తరలించే క్రమంలో బారీలోడుతో ప్రొద్దుటూరు వైపువెళ్ళతూ టైర్‌పంచర్ అయి రోడ్డుపైన ఆగి ఉండటమే ఈ ప్రమాదానికి కారణమని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## డిసెంబర్‌నాటికి అభివృద్ధి పనులు పూర్తి చేయండి

### అధికారులను ఆదేశించిన కలెక్టర్ విజయ్‌రామరాజు



**కడప అక్టోబర్ 25, ప్రభాతవార్త**

పాడా పరిధిలో పులివెందుల నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను డిసెంబర్ మాసం నాటికి సంపూర్తి చేయాలని.. కలెక్టర్ వి. విజయ్ రామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో.. పులివెందుల నియోజకవర్గ అభివృద్ధి పనులపై కలెక్టర్ వి.విజయ్ రామరాజు సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ తోపాటు.. అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయ్ రామరాజు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి స్వంత నియోజక వర్గం.. పులివెందులలో చేపట్టిన అభివృద్ధి పనులన్నింటినీ వేగవంతం చేసి.. నిర్దేశిత సమయంలోగా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. పులివెందులలో పురోగతిలో ఉన్న వివిధ అభివృద్ధి పనులలో భాగంగా ప్రధానంగా సిటీ సెంట్రమ్, ఉలిమెల్ల లేక్ వ్యూ, జగనన్న హౌసింగ్ కాలనీల్లో మౌలిక వసతులతో పాటు.. మోడల్ టౌన్‌లో భాగంగా చేపట్టే వివిధ అభివృద్ధి పనుల కోసం చేపట్టిన భూసేకరణ ప్రక్రియలో ఎలాంటి సమస్య, పెండింగ్ లేకుండా క్లియర్ చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో పులివెందుల ఆర్డీవో వెంకటే శ్వర్లు మున్సిపల్ కమీషనర్ నరసింహా రెడ్డి, ఆర్‌అండ్ బి, పీఆర్, అగ్రికల్చర్ మార్కెటింగ్, హౌసింగ్, మోడల్ టౌన్ కన్సల్టెన్సీ ప్రతినిధులు, ఏపిఎంఎస్ఐడిసి ఎస్.ఈ., ఈఈలు, పాడా అధికారులు, రెవెన్యూ, ఇంజనీరింగ్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కంప్యూటర్ విద్య మిథ్య..

**– ప్రభుత్వ పాఠశాలల్లో మూలకు చేరిన కంప్యూటర్లు**

**– ఆందోళనలో విద్యార్థులు**

**రాయచోటి, అక్టోబరు 25, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం సీబీఎస్ఈ సిలబస్ అంటూ గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం వాస్తవానికి కంప్యూటర్ విద్యకు విద్యార్థులను దూరం చేసింది. ట్యాబ్‌ల పేరు చెప్పి ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ విద్యకు మంగళం పాడింది. దీంతో నాలుగేళ్లుగా కంప్యూటర్లు మూలన పడి ఉన్నాయి. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సాంకేతిక విద్య అందని ద్రాక్షగానే మిగిలింది. అన్నమయ్య జిల్లాలో 2219 ప్రభుత్వ పాఠశాలల్లో 1,54,000 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రస్తుతం 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం అంతంత మాత్రమే ఉంది. టీడీపీ ప్రభుత్వం విద్యార్థులను ఆధునిక పరిజ్ఞానం దిశగా నడిపించాలనే ఉద్దేశంతో 6వ తరగతి నుంచి కంప్యూటర్ విద్యను ప్రవేశ పెట్టింది. విద్యార్థులకు కంప్యూటర్ కోర్సును బోధించడానికి జిల్లా పరిషత్ పాఠశాలలకు 10 నుంచి 20 వరకు కంప్యూటర్లు అందజేసింది. కంప్యూటర్ పిరియడ్ కోసం ప్రత్యేకంగా ఒక ఉపాధ్యాయుడిని నియమించింది. ఎక్సెల్, గూగుల్ సీట్ గూగుల్ డాక్యుమెంట్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ వంటివి విద్యార్థులకు నేర్పించేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత సాంకేతిక విద్యకు మంగళం పాడింది. దీంతో ఇచ్చిన క్రోమ్ పుస్తకాలు సైతం పక్కన పడేశారు. కంప్యూటర్ విద్య స్థానంలో వైసీపీ ప్రభుత్వం బైజూస్ పేరుతో గత ఏడాది డిసెంబరులో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేసింది. ప్రస్తుతం వీరు 9వ తరగతికి వచ్చినా టట్యాబుల్‌లోన్ల సంబంధిత సిలబస్‌ను లోడింగ్ చేయలేదు. దీంతో విద్యా ర్థులు ఆందోళన చెందుతున్నారు. మరో పక్క ఈ ఏడాది 8వ తరగతి చదువు తున్న విద్యార్థులకు నేటికీ ట్యాబ్‌లు అందజేయలేదు. ప్రస్తుతం డిజిటల్ తరగ తులు అంటూ ప్రభుత్వం పాఠశాలల్లో ఎల్ఈడీలు ఏర్పాటు చేసినా ప్రయోజనం కనిపించలేదు.



**కంప్యూటర్ తరగతులు పెట్టాలి**

పాఠశాలల్లో కంప్యూటర్ తరగతులు పెట్టాలి. దీని వల్ల విద్యార్థుల్లో కంప్యూటర్ పరిజ్ఞానం పెరుగుతుంది. ఎక్సెల్, వర్డ్ వంటి కోర్సులను నేర్చుకునేం దుకు వీలుంటుంది. ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్‌లలో కేవలం తరగతుల సిలబస్ మాత్రమే ఉంటుంది.

డిజిటల్ బోధన అందిస్తున్నాం.. గతంలో ఉన్న కంప్యూటర్ తరగతుల స్థానం లో ప్రస్తుతం ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ డిజిటల్ తరగతుల బోధన జరుగుతుంది. విద్యార్థులకు ట్యాబులిచ్చి కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందిస్తున్నామని మండల విద్యాశాఖాధికారి తెలిపారు.

## ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యుల సేవలు సంతోషకరం



**బద్వేలు అర్బన్, అక్టోబర్ 25 ప్రభాతవార్త**

దసరా ఉత్సవాలలోభాగంగా శ్రీ ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు చింతకుంట ధనలక్ష్మి, స్టేట్ ఉపాధ్యక్షురాలు కొండపల్లి దేవి, సెక్రటరీ గంగిశెట్టి ధనమ్మ, జిల్లా జనరల్ సెక్రటరీ దేవతి లలిత పలువురు మహిళలు ప్రతిరోజూ అమ్మవారి సేవలో ఉంటూ భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తూ ఉత్సవాల విజయవంతానికి కారకులైన ఆర్యవైశ్య మహిళా మండలి కమిటి సభ్యులను, కమిటి అధ్యక్షులు కేవి.సుబ్బారావుతో పాటు పలువురిని ఆర్యవైశ్య వర్తక సంఘం సభ్యులు కొణిజేటి శేఖర్, వారి సతీమణి భాగ్యలక్ష్మి కుటుంబ సభ్యులను అమ్మవారి సన్నిధిలో శాలువా, పూలమాలలతో పలువురిని సత్కరించి అభినందనలు తెలిపారు. ఆలయ కమిటి సభ్యులకు, మహిళా మండలి, యువజన సంఘం కమిటి సభ్యులందరికీ అమ్మవారి ఆశీస్సులు కలగాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో పబ్బతి శ్రీదేవి, తులసి వరలక్ష్మి, గొంట్ల కుమారి, వందవాసి ధనమ్మ, మెంటా లక్ష్మినారాయణమ్మ, వరలక్ష్మి, జూటూరు పద్మతో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.

# గంజాయి 'దమ్ము' బిగించి కొడితే...

**రాజంపేట అర్బన్, అక్టోబరు 25 ప్రభాతవార్త**

గంజాయి విక్రయం విచ్చలవిడిగా మారింది. మద్యం కంటే తక్కువ ధరకు గంజాయి పొట్లాలు దొరుకుతుండడంతో యువత దానికి బానిస అవుతున్నారు. గ్రామీణ ప్రాంతాలకు కూడా గంజాయి సరఫరా జరుగుతుందంటే ఈ నెట్‌వర్క్ ఎంత వేగంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. గంజాయి మత్తులో ఏమి చేస్తున్నారో తెలియని అకృత్యాలకు పాల్పడుతున్నారు. తాజాగా రైల్వేకోడూరు ఓ యువకుడిని మరో ముగ్గురు స్నేహితులే అంతం చేయ డం వెనుక గంజాయి మత్తులో నిందితులు ఉండడమేనని అత్యంత విశ్వస నీయవర్గాల ద్వారా తెలిసింది. హతుడు హనీకుమార్‌ను నిందితులు కత్తితో చెస్ట్‌పై పొడిచిన పోటు చూస్తుంటే ఎంత కర్కషం గా ఎంత ఆవేశంలో పొడిచి ఉంటారన్నది గాయం లోతు చూస్తే తెలుస్తోంది. 3 ఇంచెలు పైబడి గాయం లోతు ఉన్నట్లు పోస్టు మార్టంలో తేలినట్లు సమాచారం. పోలీసులు హత్య జరిగిన తర్వాత ముగ్గురు యువకులను అదుపులోకి తీసు కున్నట్లు సమాచారం. ఈ విచారణలో గంజాయి తాగి ఉన్నట్లు తెలిసింది. హత్యకు గంజాయి ప్రేరేపితమో లేదో పోలీసులు తేల్చాల్సి ఉంది. హత్య విషయం పక్కనబెడితే మద్యంకంటే గంజాయి మత్తు అదో ప్రపంచానికి తీసుకెళుతుం దనడంలో సందేహం లేదు. రోజు సేవించే సమయానికి గంజాయి లేకపోతే వారి మానసిక పరిస్థితి దారుణంగా ఉంటుంది. రైల్వేకోడూరులో రైల్వే స్టేషన్, మార్కెట్‌యార్డు, మరికొన్ని ప్రాంతాల్లోను పట్టణంలోని కొన్ని కేంద్రా ల్లో గంజాయి విక్రయం జోరుగా జరుగుతున్న దని తెలుస్తోంది. రాజంపేట పట్టణంలో కూడా జోరుగా గంజాయి విక్ర యాలు జరుగుతున్నాయి. ఇటీవల చెర్లోపల్లె గ్రామంలో ఆలయం వద్దే కొందరు యువకులు గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు తెలుసుకున్నారు. పాత కాలంలో గంజాయిని బిక్షాటన చేసేవారు, ఆలయాల్లో ఆధ్యాత్మికంగా ఉండిపోయే వారు, వృద్ధులు సేవించేవారు. గంజాయి దమ్ముకు అలవాటు పడితే ఎంత దారుణంగా ఉంటుందో వారి శరీరం, కళ్లు చూస్తేనే తెలుస్తోంది. రాజంపేట మండలంలో ఆకేపాడు పరిసర గ్రామాల్లో గంజాయి పొట్లాలు అమ్ముతున్నారంటే ఏ స్థాయిలో గంజాయి విక్రయించే ముఠా వ్యాపారం ఎంతగుట్టుగా చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. రాజంపేట ప్రాంతంలో మన్నూరు లోని ఓ కళ్యాణ మండపం వెనుక పొలాల్లో యువకులు గ్రూపులుగా చేరి గంజాయి తాగుతున్నట్లు సమాచారం. బోయన పల్లెలో యువత గంజాయి వ్యసనానికి లోనైనట్లు సమాచారం. ఇటీవల ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మోటారు బైకు పై వెళుతూ మరణించడం వెనుక గంజాయి మత్తులో అతివేగంగా బైకు నడపడమే నని తెలిసింది. ఇకనైనా గంజాయి విక్రయించే ముఠాపై పోలీసులు దృష్టి సారిస్తే ప్రమాదకరమైన గంజాయిని నిర్మూలించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉంది.

## గంజాయి కోసం తగువులాట - వ్యక్తి మృతి

### పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు

**రైల్వేకోడూరు రూరల్, అక్టోబరు 25 ప్రభాతవార్త**



ఘర్షణలో మృతి చెందిన యువకుడు (ఫైల్)

రైల్వేకోడూరు పట్టణంలోని నరసరాంపేటకు చెందిన ఇద్దరు యువకులు గంజాయి కోసం తీవ్ర స్థాయిలో వాదోప వాదాలు చేసుకుని మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో తీవ్ర స్థాయిలో ఘర్షణ పడి ముస్లిం యువకుడు దళిత కులానికి చెందిన యువకుడిని పిడుబాకుతో పొడవడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. శవ పరీక్ష నిమిత్తం యువకుడిని రాజంపేటకు తర లించి ముగ్గురు నిందితులను పోలీసుల అదుపులో విచారణ చేపట్టినట్లు తెలిపారు. కొంత కాలంగా రైల్వేకోడూరు పట్టణంలో విపరీతమైన గంజాయికి బానిసై తీవ్ర స్థాయిలో యువకులు తీవ్రస్థాయిలో ఒకరి నొకరిని చంపుకునే పరిస్థితి నెలకొంది. పోలీసు ఉన్నతాధికారులు దృష్టిసారించి గంజాయిని నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

## కోడూరులో గంజాయి, మద్యం మత్తులో పెరుగుతోన్న నేరాలు

**ఓబులవారిపల్లె, అక్టోబరు 25, ప్రభాతవార్త:**

రైల్వేకోడూరు నియోజకవర్గం అన్ని మండలాల్లోకి అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది రాయలసీమ హైదరాబాద్, తెలంగాణ ప్రాంతాల నుంచి వివిధ వ్యక్తుల పైన జీవనోపాధి కోసం పట్టణంలో అధిక సంఖ్యలో జనాభా ఉంది. ఉపాధి కోసం ఇతర ప్రాంతాల నుంచి పలువురు ఇక్కడికి వచ్చి జీవిస్తున్నారు. ఇలాంటి కోవలోనే కొంత మంది మద్యానికి, గంజాయికి బానిసలై విస్తృతంగా చాప కింద నీరులా ఈ వ్యాపారం 3 పువ్వులు 6 కాయలుగా వర్ధిల్లుతోందని పట్టణ వాసులు వాపోతున్నారు. పోలీసులు పలుమార్లు దాడులు చేసి నిందితులపై కేసులు పెట్టుకున్నా జైలుకు పంపినా వారు వ్యాపారాలు మాన లేదనే సమాచారం జోరుగా సాగుతోంది. ఎక్కువగా పండ గలు జరుపుకునే సమయంలోనే గంజాయికి బానిసలైన యువకులు మత్తులో చిన్న చిన్న గొడవలు కారణంగా హత్యలకు దారి తీసే పరిస్థితులు దాపురిస్తున్నాయి. తల్లిదండ్రులు



వారి బిడ్డల్లో మార్పు ఎలా ఉంది, వారు ఏం చేస్తున్నారో వారి నడవడికపై దృష్టి సారించా ల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు గంజాయి సేవించి, మద్యం సేవించి అలజడి సృష్టిస్తూ రౌడీయిజం చేసే వారిపై పోలీసులు కొరఢా ఝుళిపించాలని సమాజంలో శాంతి భద్రతలు కల్పించాలని పలువురు మేధావులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా

## – నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి బీటెక్ రవి

**పులివెందుల, అక్టోబరు 25, ప్రభాతవార్త**

పులివెందుల తెదేపా కార్యాలయంలో నవంబరు 1వ తేదీ నుండి ప్రజలకు 24/7 అందుబాటులో ఉంటానని నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి బీటెక్ రవి అన్నారు. పులివెందులలోని నూతన టీడీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయదశమి రోజున వేద పండితులచే కార్యాలయాన్ని ప్రారంభించామని తెలిపారు. నవంబరు 1వ తేదీ నుండి నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి శ్యామల ఛండీ యాగం చేయనున్నామని, అప్పటి నుండి ప్రతిరోజు సమస్యలపై వచ్చే ప్రజలకు అందు బాటులో ఉండి వాటి పరిష్కారం కోసం కష్టపడి పనిచేస్తామని అన్నారు. పులివెందుల ప్రాంతం ఉద్యాన పంటలకు బెస్ట్ అయినప్పటికీ శనగలు, మినుములు, ధనియాలు, తదితర తృణధాన్య పంటల సాగుపై రైతులు ఆధారపడి ఉన్నారన్నారు. ఈ ఏడాది వర్షాలు సరిగా పడలేదని, పైడిపాళెం, సీబీఆర్, గండికోట డ్యామ్‌లో కావల్సిన నీరు ఉందని, ఇప్పటికే కాలువలకు నీరు వదిలి ఉంటే రైతులకు ఖరీఫ్ పంటల సాగుకు అవకాశం ఉండేదన్నారు. రైతులపై వివక్షనో లేక అవగాహన లోపం వల్లనో నీటిని విడుదల చేయకపోవడంతో ఐతుకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. వెంటనే కాలువలకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విత్తనం వేయడానికి ఇంకా పది రోజులు సమయం ఉందని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నీటిని విడుదల చేయాలన్నారు. సాగునీరు కరువుగా ఉంటే పీబీసీ నీటిని రాణితోపులో బోటింగ్‌కు వినియోగించడం దాఉణం అన్నారు. పంటలు సాగు చేయకుండా ఒకటో తేదీ ఏ పథకం ద్వారా ఎంత అమౌంట్ వస్తుందని ప్రజలు ఎదురుచూసేలా, ప్రజలకు స్వతంత్ర ప్రతిపత్తి లేకుండా చేయడమే సీఎం వైఎస్ జగన్ లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. గతంలో పంటలు సాగుచేయక పోయినా, పంటలు దెబ్బతిన్నా రైతులు చెల్లించిన సొమ్ముతో బీమా వచ్చేదని, కానీ ఆ ప్రీమియం నేనే కడతాను అని సీఎం జగన్ చెప్పి రైతులకు ఎప్పుడు ఏ బీమా వస్తుందో తెలియని అయోమయ స్థితిలో పెట్టారన్నారు. గతంలో సాగునీటి కోసం రోజుకు ఏడు గంటలు విద్యుత్తు ఇచ్చే వాళ్లం అని, ప్రస్తుతం కూడా ఏడు గంటలకు తగ్గకుండా విద్యుత్ సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సీఎం ఇలాకాలో నీటిపారుదల శాఖలో ఖాళీలు ఉన్నాయని, సీఎం హోదాలో ఉండి ఖాళీలు కూడా భర్తీ చేయలేని స్థితిలో ఉండటం దారుణం అన్నారు. నవంబరు 1వ తేదీ నుండి పులివెందుల పట్టణంలో 30రోజుల పాటు ఇంటింటికీ తెదేపా కార్యక్రమం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.



**– ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఖరీఫ్‌లో పంటలు సాగుచేయని రైతన్న**

**– నిండుగా ఉన్న కాలువలకు నీటిని విడుదల చేయని ప్రభుత్వం**

**– సీఎం ఇలాకలో ఇరిగేషన్ శాఖలో అధికారుల కొరత**

**– నవంబరు 1 నుండి గడపగడపకు తెదేపా**

### సోమవారం నాటికి నీటిని విడుదల చేయకపోతే ధర్నా చేస్తాం

**పట్టణ మాజీ అధ్యక్షుడు మద్దూరి వెంకటరామిరెడ్డి**

రైతుల పట్ల వైకాపా ప్రభుత్వం ఏ మాత్రం చిత్తశుద్ధి కనపరచడం లేదని, అన్ని ప్రాజెక్టులు నిండుగా ఉన్నా నీటిని విడుదల చేయకపోవడం వల్ల ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేయలేకపోతున్నారని తెదేపా పట్టణ మాజీ అధ్యక్షుడు మద్దూరి వెంకటరామిరెడ్డి అన్నారు. ప్రభుత్వం అన్ని మండలాలలో సబ్సిడీ శనగ విత్తనాలు పంపిణీ చేసిందని, కానీ వర్షాలు పడలేదని ముందు జాగ్రత్తగా నీటిని విడుదల చేసి ఉంటే సాగు చేసుకుని ఉండేవారన్నారు. ఇప్పటికీ ఇంకా పదిరోజుల సమయం ఉందని, వెంటనే నీటిని విడుదల చేసి రైతులు పంటలు సాగుచేసుకునేలా చేయాలని కోరారు. లేకుంటే ఎక్కడికక్కడ రైతులతో కలిసి నీటిని విడుదల చేసే వరకు ధర్నాలు నిర్వహిస్తామని అన్నారు. రైతు సంక్షేమం కోసం తెదేపా ఎంతవరకైనా పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## శభాష్ శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, బాషా..!

### వీక్లీ బెస్ట్ పెర్ఫార్‌మెన్స్ అవార్డుఅందజేసిన జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

**కడప క్రైం, ప్రొద్దుటూరు క్రైం, అక్టోబరు 25, ప్రభాతవార్త:**

పోలీసు సిబ్బందిని ప్రోత్సహించే క్రమంలో ఇటీవల జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ అత్యుత్తమ పనితీరు కనబరిచిన వారికి వీక్లీ బెస్ట్ పెర్ఫార్‌మెన్స్ అవార్డును అందజేస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో మొట్ట మొదటి సారిగా బుధవారం ముగ్గురు సిబ్బందిని ఎంపిక చేసి అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నగదు రివార్డు, ప్రశంసా పత్రాలను అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. ప్రొద్దుటూరు రూరల్ పరిధిలో ఎనిమిదేళ్ల కిందట జరిగిన హత్య కేసులో నాన్ బెయిలబుల్ వారంట్ ఉంటూ తప్పించుకు తిరుగుతున్న నిందితున్ని శ్రమించి అరెస్టు చేశారు. ప్రొద్దుటూరు రూరల్ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుళ్లు బి.శ్రీనివాస్, ఎస్.మధుసూదన్‌రెడ్డిలను జిల్లా నగదు రివార్డు, ప్రశంసా పత్రం అందజేసి అభినందించారు.

**మోటారు సైకిళ్ల దొంగను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన చెన్నూరు కానిస్టేబుల్ బాషా..**

చెన్నూరు పోలీసు స్టేషన్ పరిధిలోఓ ద్విచక్ర వాహనాల దొంగ నుంచి ఆరు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన ఎస్.కె.బాషాను జిల్లా ఎస్పీ అభినందించారు. స్ఫూర్తిదాయకమైన సేవలు అందించి పోలీసు శాఖ ఔన్నత్యాన్ని పెంపొందించారని ముమ్ముందు ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆకాంక్షించారు.


**కంపు బాబోయ్... కంపు**

– రోడ్డుపై ప్రవహిస్తున్న మురికినీరు

– పట్టించుకోని అధికారులు 2లో

## ఇంటింటా ఆరోగ్యం కోసమే జగనన్న సురక్ష

### ఎమ్మెల్యే నవాజ్‌బాషా



మదనపల్లె, అక్టోబర్ 25 ప్రభాతవార్త :

ఇంటింటా ప్రజలు ఆరోగ్య వంతు లుగా ఉండేందుకే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పెట్టిందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా తెలిపారు. బుధవారం నిమ్మనపల్లె మండలం, మదనపల్లె రూరల్ మండలం, మున్సి పాలిటి పరిధిలోని 24వ వార్డులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిధిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నా రన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రజల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పనిచేయడం జరుగుతుందన్నారు. ఆరోగ్య వైద్యశిబిరాల వల్ల అనారోగ్యాలకు గురైన వారికి మెరుగైన పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందు లను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మున్సిపాలిటిలో జరిగిన వైద్యశిబిరంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌ఛైర్మెన్‌లు జింకా చల పతి, నూర్ అజాం, కౌన్సిలర్లు రేణుక, మేస్త్రీ శ్రీనివాసులు, ఆర్‌వి.శివారెడ్డి, ఎస్‌వి.రమణ, శారదారెడ్డి, రూరల్ మండలంలో ఎంపిపి వెలుగు రెడ్డమ్మ, సర్పంచ్ మహేష్, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## పట్టణాభివృద్ధిని విస్మరించిన వైకాపా

### జనసేన కోకన్వీనర్ రాందాస్‌చౌదరి



మదనపల్లె, అక్టోబర్ 25 ప్రభాతవార్త :

జిల్లాలో సెలక్షన్‌గ్రేడ్ మున్సి పాలిటి గా ఉన్న మదనపల్లె పట్టణా భి వృద్ధిని ఎమ్మెల్యే నవాజ్‌బాషా, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి విస్మరించారని జనసేన పార్టీ రాయలసీమ కోకన్వీనర్ గంగారపు రాందాస్‌చౌదరి తెలిపారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రెండు నెలలుగా జరగకపోవడంతో పలు అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయన్నారు. వీరి ఇద్దరి మధ్య నెలకొన్న వైసమ్యాల కారణంగా పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నెల లోనైనా కౌన్సిల్ సమావేశం జరిపి ప్రజా అవసరాలు తీర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మంత్రి రోజా పవన్‌కళ్యాణ్ భార్యను, చంద్రబాబు సతీమణి భువనేశ్వరీపై విమర్శలు చేయడం భావ్యం కాదన్నారు. రోజానోరు అదుపులో పెట్టుకొని మాట్లా డాలన్నారు. ఆమె ఆదాయంపై సిబిఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కార్య క్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరామ్, నాయకులు గజ్జల రెడ్డెప్ప, బాబు, రెడ్డమ్మ, చంద్రశేఖర్, గడ్డం లక్ష్మీపతి, గౌతం పాల్గొన్నారు.

## డిసిసి అధ్యక్షుల ప్రమాణస్వీకారంలో మదనపల్లె నాయకులు



మదనపల్లె, అక్టోబర్ 25 ప్రభాతవార్త :

జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షు లుగా అల్లాభక్షు ప్రమాణ స్వీకారంలో మదనపల్లె పట్టణ అధ్యక్షులు, పీలే రు నియోజకవర్గ కన్వీనర్ రెడ్డి సా హెబ్ పాల్గొన్నారు. బుధవారం అన్న మయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యా లయంలో జరిగిన ప్రమాణ స్వీకారోత్స వంలో పట్టణ అధ్యక్షులతో పాటు మదన పల్లెకు చెందిన నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవుతోందన్నారు. 2024 ఎన్నికల్లో కేంద్రం లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. తెలంగాణలో జరగ నున్న ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేంద్రరెడ్డి, మహమ్మద్ రఫి, చలపతి, మహబూబ్‌ఫీర్, డాక్టర్ ఎస్‌కె.బాషా, ముబారక్‌ఖాన్ పాల్గొన్నారు.

## వాల్మీకి జయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి

మదనపల్లె, అక్టోబర్ 25 ప్రభాతవార్త :



వాల్మీకి జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని వాల్మీకి రిజ ర్వేషన్ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు నరసింహులు పిలుపు నిచ్చారు. బుధవారం మదనపల్లె ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జయంతి ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వాల్మీకిబోయలను ఐదుజిల్లాలో ఎస్‌టి లుగా, మిగిలిన జిల్లాల్లో బిసిలుగా విభజించి పాలిస్తూనే మోసం చేస్తున్నారని తెలిపారు. 2024 ఎన్నికల లోపు వాల్మీకులకు ఇచ్చిన హామీలను నిలబెట్టు కోవాలని డిమాండ్ చేశారు. వాల్మీకి జయంతిని ప్రభుత్వ సెలవుదినంగా ప్రకటిం చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు మాలతి, నాయ కులు క్రిష్ణమూర్తి, శంకర, గౌరమ్మ, శ్రీరాములు, మల్లికార్జున పాల్గొన్నారు.

## భూముల రీసర్వేపై అధికారులతో సమావేశం

### తహశీల్దార్ దైవరాజన్



రామసముద్రం, అక్టోబర్ 25 ప్రభాతవార్త :

రామసముద్రం మండలంలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న భూముల రీసర్వేపై అధి కారులతో బుధవారం తహశీల్దార్ దైవ రాజన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మండ లంలో భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని అవికూడా గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు అధికంగా భూ సమస్యలపై ఫిర్యాదులు వస్తున్నా యని అవి భూము లను రీసర్వే సంబంధించి ప్రతి అధికారి సమర్ధవంతంగా పనిచేసి మంచిపేరు తీసుకురావాలని సూచించారు. భూమి ఉన్న వారు పాసుపుస్తకాలు తీసుకొని వస్తే రెవెన్యూ సిబ్బంది వచ్చి మీ భూమి సర్వే చేసి రాళ్ళు నాటివ్వడం జరుగు తుందన్నారు. ఏ గ్రామంలోనైనా భూ సమస్యలపై రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్క రించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి న భూ సర్వే కార్యక్రమాన్ని ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసు కోవాలన్నారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారులు, డిటి తహశీల్దార్ శ్రీనివాసరావు, ఆర్‌ఐ నాగరాజు, సర్వేయర్ నాగరాజు, శేఖర్, రెహ్మాన్, శ్రీనివాసులు, అశ్విని, రాఘురామ్‌లు హాజరైనారు.

## సైకో...అవుట్...సైకిల్ ఇన్

### మండల టిడిపి అధ్యక్షులు విజయకుమార్‌గౌడ్

రామసముద్రం, అక్టోబర్ 25 ప్రభాతవార్త :



రాష్ట్రంలో అభివృద్దిని వైకాపా ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని మండల టిడిపి అధ్యక్షులు విజయ కుమార్‌గౌడ్ తెలిపారు. ప్రభుత్వంపై నిరసనగా మంగళవారం రాత్రి టిడిపి నాయకులు జగన్ అండ్ కోకి సైకో బుద్ది పోవాలని జగనా సురిడి కర పత్రాలు దహనం చేశారు. ఈ సందర్భంగా విజయకుమార్‌గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ చేస్తున్న అరాచక పాలనకు నిరసనగా కరపత్రాలను దహనం చేయడం జరిగిందన్నారు. ఈ రాష్ట్రానికి జగనాసురిడి పీడా పోవాలని విన్న విస్తూ, సైకో పోవాలి..సైకిల్ రావాలని నినాదాలు చేశారు. జగన్ ప్రభు త్వంలో కుట్రలు, కుతుంతాలుతో కూడిన రాజకీయాలు నడుస్తున్నా యని ప్రతిపక్షాలపై కక్ష సాధించడం తప్పా వైకాపా చేసిందేమి లేదన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్క మండ లం కూడా అభివృద్ధి కానరనాలేదన్నారు. చంద్రబాబునాయుడును కక్షపూరితం గానే అరెస్టు చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు చిన్నస్వామి, రెడ్డివారి భరత్, రెడ్డివారి ప్రదీఫ్‌రెడ్డి, జిల్లా టిడిపి మైనార్టీ నాయ కులు అల్తాప్‌బాషా, రామచంద్ర, నడింపల్లి రమేష్, క్రిష్ణప్ప, శివ, సలీం, చాంద్ బాషా, వేణు, జావెద్, బాబా, చాను, వాల్మీకి కిట్ట, బాలాజి మట్ట వారిపల్లె కిట్ట, బాలక్రిష్ణ, పవన్ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దైవ సంకల్ప బలంతోనే నిస్వార్ధ ప్రజాసేవకు శ్రీకారం

### - ప్రముఖ పారిశ్రామికవేత్త జయచంద్రారెడ్డి



కురబలకోట, అక్టోబర్ 25 ప్రభాతవార్త :

దైవ సంకల్ప బలంతోనే నిస్వార్ధ ప్రజాసేవకు అందకి సహకారంతో శ్రీకారం చుట్టవచ్చునని ప్రముఖ పారిశ్రామికవేత్త దాసిరిపల్లి జయచంద్రారెడ్డి అన్నారు. బుధవారం ఆయన తంబళ్ళపల్లె నియోజకవర్గంలోని కురబలకోట మండలం పిచ్చిలవాండ్లపల్లె, తంబళ్లపల్లె మండలంలో కోసు వారిపల్లె పంచాయతీ బేరిపల్లె గ్రామాల్లో పర్యటించి పలు ఆలయ నిర్మాణాలకు ఆర్ధికసాం చేశారు. పలువురు అభాగ్యులను ఆదుకొని అభయహస్తం ఇచ్చారు. కొంగవారిపల్లె శ్రీక్రిష్ణభగవానుని ఆలయ నిర్మాణానికి రూ.1.50లక్షలు, కోసువారి పల్లె గ్రామంలోని బేరిపల్లెలో ఆలయ నిర్మాణానికి రూ.20వేలు, కోసువారిపల్లెలో అనారోగ్యంతో భాదపడు తున్న హరిప్రసాద్‌రెడ్డికి వైద్య ఖర్చులకు రూ.5వేలు అంద జేశారు. పూర్వీకుల సంస్కృతి సాంప్రదాయాలను మరువరాదని వారి ఆనవాళ్ళు పురాతన గుళ్ళు, గోపురాలు పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనదేనన్నారు. ప్రజలకు నిస్వార్ధసేవ చేస్తున్న జయచంద్రారెడ్డికి స్థానిక ప్రజలు కృత జ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దాసిరిపల్లె జయచంద్రారెడ్డి, శివారెడ్డి, మాజీ సర్పంచ్ వైజిరమణ, డిఆర్. వెంక ట రమణారెడ్డి, సురేంద్ర, మాజీ వైస్ ఎంపిపి భూమి రెడ్డి, మంత్రి గిరిధర్ రెడ్డి, మార్కిరి ఆంజనేయరెడ్డి, దాదంలోకనాథ్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, మామిడి గుంపుల ప్రభాకర్‌రెడ్డి, మగ్గాలభాస్కర్, వెంకటరమణారెడ్డి, బి.మల్లయ్య, ఎంపిటిసి బం జారా రెడ్డి, బీదమల్లయ్య, బీదంరాజన్న, నాగమల్లు, శేఖర్, మల్లికార్జున రెడ్డప్ప, శంకర్‌రెడ్డి, ఎర్రప్ప, చిన్నరెడ్డప్ప, రామ్మోహన్ ప్రజలు పాల్గొన్నారు.

## మానిటరింగ్ సమావేశంలో సమస్యలు పరిష్కారం ఎక్కడ?

### - సమావేశంలో సభ్యుల ఆవేదన

ములకల చెరువు, అక్టోబరు 25, ప్రభాతవార్త:

ఎస్సీ, ఎస్టీ సమస్యలపై జరిగే మానిటరింగ్ సమావేశాలలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన సమస్యలు పరిష్కారం కావడం లేదని, సమావేశం తూతూ మంత్రంగా జరుగుతోందని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సమావేశం కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ములకలచెరువు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సమావేశాల్లో ఎన్నో సమస్యలు అధికారుల దృష్టికి తెచ్చినా సమావేశంలో చేస్తామని చెబుతున్నా రు తప్ప ఇంత వరకు సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదన్నారు. గ్రామాల్లోని ఎస్సీ కాలనీలో మరుగుదొడ్లు, మురికినీటి కాలువలు, సీసీ రోడ్లు, విద్యుత్తు దీపాలు, వ్యవసాయ భూముల సమస్యలు ఇలా అనేక విషయాలపై అర్జీల రూపంలో అధికారుల దృష్టికి సమావేశంలో తెచ్చినా కూడా సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని సమావేశం 3 గంటల పాటు జరిపినా సమస్యల గురించి పట్టించుకోకుండా అధికారులు వ్యవహరిస్తున్నారని కమిటీ సభ్యులు ఎమ్మార్పీఎస్ నాయకులు సుధాకర్, శ్రీరాములు, బాస్ నాయకులు రెడ్డప్పలు తహసీల్దారును నిలదీశారు. సమస్యలు పరిష్కారం కాకపోవడంతో సమావేశానికి చాలా మంది ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎమ్మా ర్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షులు ప్రతాప్ కుమార్, జిల్లా నాయకులు తిరుపాల్‌లు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీలో సమస్యలపై ఇచ్చే అర్జీలపై ఎప్పటికప్పుడు అధికారులు పరిష్కారం చూపకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ట్లు తెలిపారు. ఎన్నిసార్లు సమావేశాలు జరిగినా అదేముందిలే చేద్దాం వచ్చే సమావేశానికి పూర్తి చేస్తామని అధికారులు మభ్యపెడుతున్నారు తప్ప సమస్యలు పరిష్కరించడంలో చొరవ చూపడం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన గ్రామాలలో మురికి నీటి కాలువలు, సీసీ రోడ్లు, మరుగుదొడ్లు ఇలా అనేక సమస్య లున్నాయి. భూ సమస్యలు కోకొల్లలున్నాయి. అన్ని గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీలకు రెవెన్యూ అధికారులు స్మశానవాటిక కోసం భూమిని కేటాయించాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఉన్నా చాలా గ్రామాల్లో స్మశాన వాటికలు లేవు. ఉన్న వాటికి సరైన దారి సౌకర్యం లేదన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఎస్సీ, ఎస్టీల సమస్యలు అధికారులకు తెలియజేసి పరిష్కరించుకునేందుకు ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసిందని అయితే అధికారు ల నిర్లక్ష్యం వల్ల ఎస్సీ, ఎస్టీలకు సరైన న్యాయం జరగలేదన్నారు. అదే విధంగా గ్రామాల్లో సమస్యలు తెలుసుకునేందుకు ప్రతి నెల ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో పర్యటించి పల్లెనిద్ర చేసి సమస్యలు తెలుసుకోవాల్సిన అధికారులు వీటిపై దృష్టి సారించడం లేదన్నారు. ఈ విషయమై జిల్లాలో జరిగే మానిటరింగ్ సమావేశంలో జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో అశ్విని, ఎంఈవో వెంకటరమణ, వైద్యాధికారి, పంచా యతీ కార్యదర్శులు, వీఆర్వోలు, ఎమ్మార్పీఎస్ నాయకులు రమణ పాల్గొన్నారు.

## మెగా జాబ్‌మేళా



వాల్మీకిపురం, అక్టోబరు 25 ప్రభాతవార్తః

యువతలో అవగాహన కల్పించి మెగా జాబ్ మేళాను విజయవంతం అ య్యేవిధంగా మండల స్థాయి అధికారులంతా కషిచేయాలని స్థానిక ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ షబ్బీర్‌అహ్మద్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో స్థానిక ఎన్టీఆర్ డిగ్రీ కళాశా ల ఆవరణంలో ఈనెల 31వ తేదీ మంగళవారం ఉదయం 9గంటలకు నిర్వహిం చే మెగా జాబ్‌మేళాకు తెలుగు రాష్ట్రాలకు చెందిన 15 కంపెనీల సిబ్బంది రాను న్నారన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు మేళాను సద్వినియోగం చేసుకుని ఉద్యోగం పొందేలా వారిలో అవగాహన తో పాటు ఆత్మస్థైర్యాన్ని తీసుకురావాలని అధికారులను ఉద్దేశించి ఎంపీడీఓ అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల మరుగుదొడ్లు కూల్చివేత



వాల్మీకిపురం, అక్టోబరు 25 ప్రభాతవార్తః

పట్టణ నడిబొడ్డులోని కొత్తపేటవీధిలో విలువైన మూడున్నర సెంట్ల స్థలంలో ప్రభుత్వ ఎలిమెంటరీ పాఠశాల భవనాలతో పాటు మరుగుదొడ్లు నిర్మించారు. అయితే గత కొంతకాలంగా ప్రయివేటు వ్యక్తులు ప్రభుత్వం నిర్మించిన మరుగుదొ డ్ల స్థలం తమదేనంటూ కోర్టును ఆశ్రయించారు. ఇది ఇలా ఉండగా దసరా సెలవుల నిమిత్తం 10 రోజులు పాటు పాటశాల మూతపడింది. ఈనేపథ్యంలో బుధవారం పాఠశాల పున: ప్రారంభమైంది. బుధవారం యధావిధిగా విదులకు హాజరైన పాఠశాల హెచ్ఎం పద్మావతి పాఠశాల ఆవరణలోని ప్రభుత్వం నిర్మిం చిన మరుగుదొడ్లను కూల్చివేసిన విషయాన్ని గమించింది. అయితే విద్యాధికారుల నుంచి అనుమతి తీసుకోకుండా వారికి విషయం తెలపకుండానే సెలవుల్లో ప్రభుత్వం నిర్మించిన మరుగుదొడ్లను కూల్చివేసిన విషయాన్ని హెచ్ఎం ఎంఈఓ వెంకటరత్నం దష్టికి తీసుకుపోయారు. జరిగిన ఘటనపై ఎంఈఓ జిల్లా కలెక్టర్, విద్యాధికారితో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కోర్టులో తమకు అనుకూలంగా తీర్పు వచ్చినందుకే తాము మరుగుదొడ్లును కూల్చేశామని ప్రయివే టు వ్యక్తులు తెలిపారు. ఈవిషయమై తహశీల్దారు ఫిరోజ్‌ఖాన్, వివరణ కోరగా పాఠశాల మరుగుదొడ్లు నిర్మించిన స్థలం పంచాయతీ విద్యాశాఖకు సంబంధించిన విషయమని ఇది తమ పరిధిలో లేదని సమాధానం చెప్పారు.

## చంద్రబాబు ఆరోగ్యం బాగుండాలని ప్రత్యేక పూజలు



వాల్మీకిపురం, అక్టోబరు 25 ప్రభాతవార్తః

మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడుపై ఈప్రభుత్వం బనాయించిన అక్ర మ కేసులు వ్యవహారంలో నిదానమైన నిజమే నెగ్గి తీరుతుందని తెదేపా రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి వల్లిగట్ల వెంకటరమణ అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ మండలంలోని గండబోయినపల్లె కోటలో వెలసిన శ్రీసత్య మ్మతల్లి ఆలయంలో బుధవారం తెదేపా నాయకులతో కలిసి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రబాబు ఆరోగ్యం బాగుండాలని త్వరలోనే చంద్రబా బు కడిగిన ముత్యంలా బయటకు రావాలని వారు ప్రత్యేక, హోమాలు పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అద్యక్షులు మల్లికార్జునరెడ్డి, తెదేపా నాయకులు బొక్కసం రామకష్ణ, ఆనంద, సత్యారెడ్డిలతో పాటు కలికిరి, వాల్మీకిపురం, మండలాలకు చెందిన తెదేపా నాయకులు పాల్గొన్నారు.

## ప్రజలందరికి రక్ష జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం



పీలేరు, అక్టోబరు 25 ప్రభాతవార్తః

స్థానిక పట్టణంలోని మోడల్‌కాలనీ పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం బుధవారం డాక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచి జీనత్ ఫఫీ, డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించే మెరుగైన ఆరోగ్యసేవలు వినియోగంతో మన ఆరోగ్యం మన చేతుల్లో తథ్యమని సద్వినియోగంతో ఆరోగ్యం అభివద్ది చెందుతుందన్నారు. వివిధ ఆరోగ్య సమస్యలతో బాదపడుతున్న 604 మందికి వ్యాధుల నిర్ధారణ తదుపరి వైద్య నిపుణులతో చికిత్సలు నిర్వహించి మందులు పంపిణీ చేయడమైనదన్నారు. 5 మందిని మెరుగైన చికిత్స నిమిత్తం ఉన్నత ఆసుపత్రులకు రెఫర్ చేయడమైంది. ఈకార్యక్రమాన్ని ఎంఈఓ మురళీమోహన్‌రెడ్డి శిబిరాన్ని తనిఖీచేసి మెరుగైన సూచనలు సలహాలు ఇచ్చారు. వివిధ రంగాలలో వైద్య నిపుణులు పాల్గొన్నారు. పీహెచ్‌సీ తలపుల, పర్యవేక్షణ బందం ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది సచివాలయ అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

## జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు ఓ వరం లాంటిది

### - జడ్పీటీసీ పద్మజా లోకవర్ధన్



కలికిరి, అక్టోబరు 25, ప్రభాతవార్త:

రాష్ట్రంలో సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు ఓ వరం లాంటిదని కలికిరి మండలం జడ్పీటీసీ కాక ర్ల పద్మజా లోకవర్ధన్ అన్నారు. బుధవారం మండలంలోని మునోళ్లపల్లె పంచా యతీలో ఎంపీడీవో గంగయ్య పర్యవేక్షణలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జడ్పీటీసీ పద్మజా లోకవర్ధన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికే కొన్ని వేలాది మంది జబ్బులతో బాధపడుతున్న వారు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్య సేవలు చేయించుకొని ఆరోగ్యవంతులయ్యారన్నారు. ప్రజలందరూ ఈ కార్యక్రమా న్ని సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ తెలిపారు. బుధవారం జరిగిన జగన న్న ఆరోగ్య సురక్షలో 323 మందికి వవైద్యాధికారులు చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వేంపల్లె నూర్జహన్, ఎంపీటీసీ షాహిరా, వైసీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, ఎంపీడీవో గంగ య్య, కార్యదర్శి రేఖ, వైద్యాధికారులు చిన్నరెడ్డప్ప, కావ్యగంధ, సీహెచ్‌వో ఇంది రా దేవి, ఫార్మాసిస్ట్ భారతి, ఎహెల్త్ సూపర్‌వైజర్ హేమలత, ఏఎన్ఎం జయం తి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆత్మహత్యకు పాల్పడిన ఖదీరున్ మృతి

రాయచోటి, అక్టోబరు 25, ప్రభాతవార్త:



రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్ ఎదురు వీధిలో మంగళ వారం రాత్రి ఆత్మహత్యకు పాల్ప డిన దుగ్గనపల్లి ఖదీరున్ బుధ వారం మృతి చెందినట్లు పోలీసు లు తెలిపారు. ఒంటిపై టిన్నర్ వేసుకొని ఆత్మహత్యకు పాల్ప డడంతో 70% పైగా కాలిన ఖదీరున్‌ను మెరుగైన చికిత్సకై తిరుపతి రుయాకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఉండగా ఆమె మరణ వాంగ్మూలాన్ని జి ల్లా జడ్జీ నమోదు చేసినట్లు తెలిపారు. మృతురాలి భర్త పీరూసాబ్‌కు పంచనామా అనంతరం మృతదేహాన్ని అప్పగించారు.

## అదుపు తప్పి బోల్తాపడిన ఆయిల్ ట్యాంకర్

### - డ్రైవర్లకు గాయాలు - దెబ్బతిన్న కారు



సంబేపల్లె, అక్టోబరు 25, ప్రభాతవార్త:

మండల పరిధిలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి దేవపట్ల దాబా హోటల్ సమీపంలో బుధవారం ఆయిల్ ట్యాంకర్ అదుపు తప్పి బోల్తా పడిన సంఘటనలో ట్యాంకర్ డ్రైవర్లు సుభాన్, నాగరాజులకు గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు ఆయిల్ ట్యాంకర్ చిత్తూరు నుంచి కడప ఆలంఖా న్‌పల్లెలోని లక్ష్మీ గణపతి ఫిల్లింగ్ స్టేషన్‌కు డీజిల్ పెట్రోలు తరలిస్తుండగా దేవపట్ల మిట్ట సమీపంలోకి రాగానే ఓవర్ టేక్ చేయబోయిన కారును తప్పించబోయి ఆయిల్ ట్యాంకర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కడప ఆలంఖాన్‌పల్లెకు చెందిన డ్రైవర్లు సుభాన్, నాగరాజుకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న జర్నలిస్టుకు ఆర్థికసాయం



పులివెందుల రూరల్, అక్టోబరు 25, ప్రభాతవార్త :

పులివెందుల పట్టణంలో జర్నలిస్టుగా పనిచేస్తున్న ప్రసాద్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండడంతో చికిత్స చేయించుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న వై ఎస్ఆర్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జర్నలిస్టులు సమ కూర్చిన రూ.30వేలు నగదును బుధవారం అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జయరామక్రిష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్, కార్యనిర్వహణ కార్యదర్శి రమణారెడ్డి, గౌరవాధ్యక్షులు క్రిష్ణకుమార్, వివేక్, కోశాధికారి ఓం ప్రకాష్, ఉప కోశాధికారి మురళిల చేతుల మీదుగా ప్రసాద్‌కు అందించారు. ఈ సందర్భంగా చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న జర్నలిస్టులకు వైఎస్ఆర్ ప్రెస్‌క్లబ్ ఎల్లవేళలా తోడు ఉంటుందన్నారు. ప్రెస్‌క్లబ్ తరపున రూ.10వేలు, జర్నలిస్టులు సేకరించిన రూ.20వేలు వెరశి మొత్తము రూ.30వేలు అందించినట్లు తెలిపారు.కార్యక్రమంలో సభ్యులు సురేంద్ర, అమర్, జయరామిరెడ్డి, జాకీర్, సాదక్‌వల్లి, రమణ, చిక్కని హరికుమార్ పాల్గొన్నారు.

## రోడ్ కనెక్టివిటీని పెంచుతాం



సుండుపల్లె, అక్టోబరు 25 ప్రభాతవార్తః

రాజంపేట నియోజకవర్గంలోని ప్రతి పల్లె నుంచి నియోజకవర్గ కేంద్రానికి మరియు మండల కేంద్రాలకు రోడ్డు కనెక్టివిటీని పెంచి మెరుగైన వసతులు కల్పి స్తామని రాజంపేట నియోజకవర్గ వైసీపీ నేత గాలివీటి విజయసాగర్‌రెడ్డి అన్నా రు. బుధవారం సుండుపల్లెలో నూతన బస్టాండ్ నిర్మాణానికి సుండుపల్లె వైసీపీ నాయకులు అజంతమ్మ, అజయ్‌రెడ్డిల ఆహ్వానం మేరకు వెళ్లి బూమి పూజ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పల్లెల నుంచి మండల కేంద్రాలకు మరియు నియోజకవర్గ కేంద్రానికి లింకు రోడ్లును నిర్మించి ప్రజల ప్రయాణ సౌకర్యాలను మెరుగుపరుస్తామని అలాగే కొత్తగా మరిన్ని రోడ్లును నిర్మిస్తామని తెలిపారు. రాష్ట్రంలో మన ప్రభుత్వం సంక్షేమాన్ని ఒకవైపు కొనసాగిస్తూనే అభివద్దిలో కూడా దేశంలోనే నెంబరు వన్‌గా ఉండడానికి ప్రయ త్నిస్తున్నామన్నారు. రాష్ట్ర బడ్జెట్‌కు మించి వందకు పైగా సంక్షేమ పథకాలను క్రమం తప్పకుండా ఒక పద్దతిగా ప్రణాళిక ప్రకారం అమలు చేస్తూనే అభివద్దిలో కూడా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లడంలో మన ప్రియతమ సీఎం జగన్‌మోహ న్‌రెడ్డి విశ్వ ప్రయత్నం చేస్తున్నారని కొనియాడారు. మనందరం కలిసి జగన్‌మో హన్‌రెడ్డికి చేయూత నివ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచిలు, ఎంపీటీసీలు, మండలనాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాలుని అదృశ్యం కేసు చేధించిన పోలీసులు



కలికిరి, అక్టోబరు 25, ప్రభాతవార్త:

మండలంలోని మేడికుర్తి బీసీ హాస్టల్ నుంచి అదృశ్యమైన బాలుడు నితిన్‌కు మార్‌రెడ్డి కేసును పోలీసులు ఎట్టకేలకు చేధించి బాలున్ని అతని తండ్రి ప్రసాద్‌రె డ్డికి బుధవారం అప్పగించారు. ఎస్సై ఎస్.కె.రహీముల్లా కథనం మేరకు వివరాలి లా ఉన్నాయి. అద్దెవారిపల్లె గ్రామానికి చెందిన ప్రసాద్‌రెడ్డి కుమారుడు నితిన్‌కు మార్‌రెడ్డి మేడికుర్తి బీసీ హాస్టల్ నుంచి మేడికుర్తి జడ్పీ హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్నాడు. ఈనెల 12వ తేదీ నితిన్‌కుమార్‌రెడ్డి ఇంటి నుంచి బయలుదేరి హాస్టల్‌కు వెళ్తున్నానంటూ వచ్చి అప్పటి నుంచి అదృశ్యమయ్యాడు. దీంతో బాలు ని తండ్రి ప్రసాద్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్సై రహీముల్లా బాలుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. ఎస్సై సాంకేతిక నైపుణ్యంతో బాలుడు కర్నూలులో ఉన్నట్లు గుర్తించి అక్కడికి వెళ్లి బాలున్ని పట్టుకొని కలికిరి పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి బాలుడి తండ్రికి అప్పగించారు. అదృశ్యమైన తన కుమారున్ని పోలీసులు తమకు అప్పగించడంతో బాలుడి తండ్రి ఎస్సై ఎస్.కె.రహీముల్లాకు కృతజ్ఞతలు తెలిపారు. అదృశ్యం కేసును చేధించడంలో ఏఎస్సై మధుసూదనాచారి పోలీసులు పాల్గొన్నారు.

## శిశుసంరక్షణపై అవగాహన సదస్సు

రామసముద్రం, అక్టోబర్ 25 ప్రభాతవార్త :



రామసముదం మండలం జడ్పి హైస్కూల్‌లో ఎస్ఐ చం ద్రశేఖర్, మహిళా శిశుసంరక్ష ణపై అనవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భం గా ఎస్ఐ విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదా నం చేస్తామన్నారు. అనంతరం హెచ్ఎం చిట్టిబాబు మాట్లాడుతూ ఆడపిల్లల రక్షణపై అవగాహన కలిగి ఉండాలని తెలియని వ్యక్తులు వచ్చి మాయమాటలతో మభ్య పెడుతారు. అలాంటి వారితో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. కార్యక్రమం లో హెడ్‌కానిస్టేబుల్ శాంతకుమారి, ఉపాధ్యాయులు, పీడి చంద్రశేఖర్, మోహన్, మంజునాథ్, అల్తాఫ్, నరేంద్ర, నారాయణస్వామి పాల్గొన్నారు.

# అక్షరాస్యతపై అవగాహన సదస్సు



దువ్వూరు, అక్టోబరు 25, ప్రభాతవార్త:

మండల పరిధిలోని నీలాపురం గ్రామంలో ఏపీజీబీ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో బ్యాంకు మేనేజర్ శ్రవన్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బ్యాంకులో ఖాతా కలిగి ఉండాలన్నారు. గ్రామీణ బ్యాంకు అందజేస్తున్న సేవలు వివరించారు. ప్రధాన మంత్రి జీవన జ్యోతి, సురక్ష బీమా యోజన పథకాల గురించి వివరించారు. గ్రామీణ బ్యాంకులో ఇతర బ్యాంకుల కన్నా డిపాజిట్లపై అత్యధిక వడ్డీరేట్లు ఇస్తున్నామన్నారు. డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించారు. కళాజాత బృందంతో మ్యాజిక్ షో నిర్వహించి సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ నాగాంజనేయ, సిబ్బంది ప్రతాప్, నాగలక్ష్మిలు పాల్గొన్నారు.

# అన్నమయ్య జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తా

– డీసీసీ అధ్యక్షుడు అల్లా బకాస్

రాయచోటి, అక్టోబరు 25, ప్రభాతవార్త:



అన్నమయ్య జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తానని డీసీసీ అధ్యక్షుడు అల్లా బకాష్ చెప్పారు. రాయచోటిలో కాంగ్రెస్ పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు షేక్ అల్లాబకాష్ ప్రమాణ స్వీకార కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఏపీసీసీ ఉపాధ్యక్షుడు షేక్ నజీర్ అహ్మద్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. మాజీ రాజ్యసభ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ మీడియా ఛైర్మన్ డా.నర్రెడ్డి తులసిరెడ్డి అల్లాబకాష్‌చే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం అల్లాబకాష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దేశ భక్తుల, త్యాగధనుల పార్టీ అన్నారు. గాంధీజీ, నెహ్రూ, నేతాజీ, పటేల్, ఇందిరమ్మ, రాజీవ్ గాంధీ, సోనియమ్మ లాంటి గొప్ప నాయకులు నాయకత్వం వహించిన పార్టీ అని గుర్తు చేశారు. ఈ సందర్భంగా వారు పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కడప జిల్లా డీసీసీ అధ్యక్షుడు గున్నికుంట్ల శ్రీరాములు, అన్నమయ్య జిల్లా అసెంబ్లీ సమన్వయక కమిటీ కన్వీనర్లు రెడ్డిసాహెబ్, సోమశేఖర్‌రెడ్డి, మాజీ ఏఐసీసీ మెంబర్ అజంతుల్లా, రైల్వేకోడూరు అసెంబ్లీ ఇన్‌ఛార్జి గోశాల దేవి, రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షులు రఫీ, మహబూబ్ బాషా, బీసీ జిల్లా అధ్యక్షులు మల్లికార్జునయ్య, రాజంపేట సీనియర్ నాయకులు చీకటి చార్లెస్, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ శాంతయ్య, డీసీసీ మైనార్టీ ఛైర్మన్ మన్సూర్ అలీ, మాజీ డీసీసీ ప్రధాన కార్యదర్శి ఖదీర్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఖాదర్‌వల్లీ, జిల్లా ఆర్‌టీఐ ఛైర్మన్ అమీర్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు చెన్నకృష్ణ, జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఛైర్మన్ నరేష్, రాయచోటి పట్టణ అధ్యక్షులు ఖాదర్‌ఖాన్, తాలూకా మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, దినకర్, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కడుపు నొప్పి తాళలేక మహిళ ఆత్మహత్య

రామాపురం, అక్టోబరు 25, ప్రభాతవార్త:



మండల కేంద్రమైన పాత రామాపురానికి చెందిన పగిడిండ్ల భాగ్యమ్మ(38) అనే మహిళ కడుపు నొప్పి తాళలేక బుధవారం రాత్రి ఇంటి పైకప్పుకు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొని మృతి చెందినట్లు ఎస్సై కొండారెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రమైన పాత రామాపురానికి చెందిన భాగ్యమ్మ గత 3 సంవత్సరాల క్రితం ఆమె భర్త మృతి చెందాడు. ఆమెకు ఒక కుమారుడు రెడ్డి శేఖర్. ఈ అబ్బాయి స్థానిక రామాపురంలోని ఓ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఈమె అనారోగ్యంతో బాధపడుతూ కడపలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంటుండేది. బుధవారం సాయంత్రం కడుపు నొప్పి ఎక్కువ కావడంతో తన కుమారున్ని మందులు తీసుకు రమ్మని పంపి ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్సై కొండారెడ్డి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

వేంపల్లె, అక్టోబరు 25, ప్రభాతవార్త :



వేంపల్లె మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని వేంపల్లె సీఐ ఎస్.కె.చాంద్‌బాషా హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాలలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్సై తిరుపాల్‌నాయక్, సిబ్బందితో కలిసి మట్కా నిర్వహిస్తున్న ఆరు మందిని అదుపులోకి తీసుకుని వారి నుండి రూ.50400 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

**– 5లీటర్ల నాటుసారా స్వాధీనం :** పులివెందుల–కడప బైపాస్‌రోడ్డులోని కుప్పాల్లపల్లె క్రాస్ రోడ్డు వద్ద నాటుసారా విక్రయించేందుకు తీసుకువెళ్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ చాంద్‌బాషా తెలిపారు. వేంపల్లె రెడ్డెయ్య కాలనీకి చెందిన కట్టెల శ్రీనివాసులును అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న 5 లీటర్ల నాటుసారాను స్వాదీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

**– గొడవపడిన కేసులో ముద్దాయిలకు రిమాండ్ :** వేంపల్లెలోని పుల్లయ్య తోటలో గొడవ పడిన కేసుకు సంబంధించి ఇద్దరు ముద్దాయిలను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చాంద్‌బాషా వెల్లడించారు. పట్టణంలోని శ్రీరామ్‌నగర్ ప్రాంతానికి చెందిన ఇరగదెండ్ల వీరాంజనేయులు, బత్తల పరమేష్‌లు స్థల విషయమై గొడవ పడడంతో వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వివరించారు.

# బొంబాయి ఏజాస్‌ను పరామర్శించిన సుగవాసి ప్రసాద్‌బాబు



చిన్నమండెం, అక్టోబర్ 25(ప్రభాతవార్త):

చిన్నమండెం పట్టణానికి చెందిన బొంబాయి ఏజాస్ కాలుకు బాగా లేక చికిత్స పొంది ఇంటి దగ్గరున్న విషయం తెలుసుకున్న మాజీ టీటీడీ పాలకమండలి సభ్యులు, రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకులు సుగవాసి ప్రసాద్‌బాబు పరామర్శించారు. అనంతరం కాలు బాగా లేకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ మల్లిఖార్జున, జిల్లా మైనార్టీ నాయకుడు ఇర్షాద్‌ఖాన్, మండల తెలుగు యువత అధ్యక్షుడు తౌహీద్‌ఖాన్, బాల చంద్రయాదవ్, రైస్‌మిల్ శంకర, సైఫుల్లాఖాన్, వాజీద్, సాదిక్, రవినాయుడు, బాబ్జాన్, నవాజ్, మాతి, మన్నేరురామాంజనేయులు, బడిశెట్టి రవి, చెన్నకృష్ణ నాయుడు, జనార్ధన్, పలువురు కార్యకర్తలు ఉన్నారు.

# సంక్షేమ పథకాల అమలులో ఏపీనే ప్రథమం

– వైఎస్ మనోహర్‌రెడ్డి



పులివెందుల, అక్టోబరు 25, ప్రభాతవార్త :

సంక్షేమ పథకాల అమలులో ఇతర రాష్ట్రాల కంటే ఏపీనే ప్రథమ స్థానంలో ఉందని పులివెందుల మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి అన్నారు. పులివెందులలోని పెద్దకొండప్ప కాలనీ, చిన్నకొండప్పకాలనీలలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ మనోహర్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. దేశంలో, మన రాష్ట్రంలో అమలవుతున్నని పథకాలు మరెక్కడా లేవన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, వైస్‌ఛైర్మన్ హాఫీజ్, హాల్ గంగాధర్‌రెడ్డి, పార్నపల్లె కిషోర్, వీరారెడ్డి, కౌన్సిలర్లు, అదికారులు పాల్గొన్నారు.

# పులివెందుల అర్బన్ ఎస్సైగా విష్ణునారాయణ

పులివెందుల రూరల్, అక్టోబరు 25, ప్రభాతవార్త :



పులివెందుల అర్బన్ ఎస్సైగా విష్ణునారాయణ బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఇక్కడ ఉన్న ఎస్సై సత్యనారాయణ వీఆర్‌కు వెళ్లగా స్పెషల్ బ్రాంచిలో ఉన్న ఎస్సై విష్ణు నారాయణను పులివెందుల ఎస్సైగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# అవినీతి రహిత సమాజం కోసం కృషి

– అవినీతిరహిత సమాజంపై అవగాహనా సదస్సు

– హాజరైన పవర్‌గ్రిడ్ సంస్థ డీజీఎం చంద్రశేఖర్

గాలివీడు, అక్టోబర్ 25(ప్రభాతవార్త):



పవర్‌గ్రిడ్ సంస్థ గాలివీడు మండల పరిధిలో అక్టోబర్ 30 నుండి నవంబర్ 4, 2017 వరకు విజిలెన్స్ అవేరెనెస్ వీక్‌ను జరుపుకుంటున్నారు. విజిలెన్స్ అవేర్‌నెస్ వారోత్సవాల ప్రారంభోత్సవం సందర్భంగా మండలంలోని వెలిగల్లు గ్రామ సచివాలయం భవనం వద్ద ప్రజలకు అవినీతిరహిత సమాజంపై అవగాహన కోసం బుధవారం పవర్‌గ్రిడ్ వారు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పవర్‌గ్రిడ్ సంస్థ డీజీఎం చంద్రశేఖర్ అవినీతిరహిత సమాజ నిర్మాణంపై గ్రామీణ ప్రజలను పూర్తి అవగాహనపరిచారు. అనంతరం వారు మాట్లాడుతూ అవినీతిరహిత సమాజ స్థాపనకు అందరూ కృషి చేయాలని, అందులో గ్రామీణ ప్రజల పాత్ర కీలకమని పూర్తి అవగాహన అవసరం అని డీజీఎం అన్నారు. చీఫ్ మేనేజర్‌లు ఆనంద్, దామోదర్ మేనేజర్లు ప్రభాకరన్‌లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిజాయితీ, నిబద్ధతతో పనిచేసి అలాగే గ్రామ ప్రజానీకం అవినీతిపై ప్రశ్నించడం చేయాలే కానీ ప్రోత్సహించడం మంచిది కాదన్నారు. అవినీతిపై పూర్తి అవగాహనతో ఉండాలని సూచించారు. అవినీతిని పారద్రోలాలని పిలుపునిచ్చారు. సమసమాజ స్థాపనలో అవినీతి, లంచం అవరోధాలుగా నిలిచాయన్నారు. నిస్వార్థ సేవకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలిగల్లు గ్రామ ప్రజలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# రాజంపేటలో వైభవంగా వాసవిమాత వసంతోత్సవం



రాజంపేట అర్బన్, అక్టోబరు 25 ప్రభాతవార్త

10 రోజుల పాటు రాజంపేట అంగరంగ వైభవంగా జరిగిన దసరా వేడుకలు బుధవారం ముగిశాయి. వాసవిమాత నవరాత్రి ఉత్సవాలను వైభవంగా జరిపించుకుని పురవీధుల్లో గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. వసంతోత్సవ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన వాసవిమాత రథాన్ని మహిళా భక్తులే లాగి తమభక్తిని చాటుకున్నారు. ప్రతిఇంట అమ్మవారి గ్రామోత్సవ రథానికి వసంతాలతో ఆర్యవైశ్య సోదరులు స్వాగతం పలికారు. ఆర్యవైశ్య సోదరులు ఆనందోత్సహాల మధ్య వసంతోత్సవంలో పాల్గొన్నారు. మరోవైపు మంగళవారం అర్ధరాత్రి ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో పాతబస్టాండు 4 రోడ్ల కూడలిలో నిర్వహించిన బాణాసంచ వెలుగులను చూసేందుకు వేలాదిగా రాజంపేట పరిసర ప్రాంత ప్రజలు తరలివచ్చారు. రంగు రంగుల దీపాలతో కల్లు మిరుమిట్లుగొలిపేలా వివిధ రకాల బాణాసంచ రాకెట్లు, నాగుపాములు, చెట్లతో పాతబస్టాండు పట్టపగల్లా మెరిసిపోయింది. అర్ధరాత్రి దాటినా బాణాసంచ పేల్చే కార్యక్రమం ఆలస్యమైనా భక్తులు చూసేందుకు అలాగే ఉండిపోయారు.

# ఆలయాల జీర్ణోద్ధరణకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి భూమి పూజ



తంబళ్లపల్లె, అక్టోబరు 25, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె మండల కేంద్రానికి సమీపంలోని మల్లయ్యకొండ ఆలయానికి సంబంధించిన పలు పురాతన ఆలయాలకు బుధవారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఉదయం మల్లయ్యకొండ సుదా తం భావి వద్ద గల పురాతన వినాయకుడు ఆంజనేయస్వామి ఆలయాల స్థానంలోనే రెండు ఆలయాలు పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి చేత శాస్త్రోక్తంగా హోమంతో పాటు ప్రత్యేక పూజలు, అర్చనలు అభిషేకాలు నిర్వహించి భూమి పూజ నిర్వహించారు. అనంతరం మల్లయ్యకొండ మధ్యలో గల వెలుగు మల్లమ్మ ఆలయ జీర్ణోద్ధరణకు సైతం హైందవ సాంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహించి ఆలయ జీర్ణోద్ధరణకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి మాట్లాడుతూ మల్లయ్యకొండ మహాశివుని ఆలయ పున నిర్మాణం చేపట్టడం మా కుటుంబం చేసుకున్న పుణ్యఫలమని ఇందులో భాగంగా వినాయక ఆంజనేయ స్వామి వెలుగు మల్లయ్య గౌరీమాత ఆలయాల నిర్మాణాలు పూర్తయితే మల్లయ్య కొండ శోభ దశ దిశల వ్యాపించడం ఖాయమన్నారు. ఇప్పటికే అభివృద్ధితో వేలాదిగా భక్తులు దర్శించుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో మల్లయ్యకొండ ఛైర్మన్ ఎంపీపీ అనసూయ నారాయణరెడ్డి, మైనుద్దీన్, మండలంలోని శివ భక్తులు, సర్పంచులు, ఎంపీటీసీలు, వైకాపా నాయకులు,ప్రజలు పాల్గొన్నారు.

# రేపు శ్రీ మండెం లక్ష్మీ నరసింహస్వామి ఆలయ చెట్లు విక్రయ వేలం ప్రకటన

చిన్నమండెం, అక్టోబర్ 25(ప్రభాతవార్త):

మండల పరిధిలోని జల్లావాండ్లపల్లెలో వెలసియున్న శ్రీ మండెం లక్ష్మీ నరసింహస్వామి బాలాలయ ప్రతిష్ట, భూమిపూజ జరిగి దేవస్థానం ఆవరణంలో మరియు కోనేరు వద్ద గల చెట్లను ఈ నెల 27వ తేదీన ఆలయ అధికారుల సమక్షంలో బహిరంగ వేలం ద్వారా విక్రయించబడునని ఆలయ కార్యనిర్వహణాధికారి కొండారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొను ప్రతి ఒక్కరూ ధరావత్తు కింద రూ.10 వేలు చెల్లించి పాటలో పాల్గొనాలన్నారు. వేపచెట్లు–17, చింతచెట్లు–3, కానుగచెట్లు–3 వేలం వేయబడునని తెలిపారు. హెచ్చు పాటదారునిగా నిలిచిన వారు వెంటనే పాట మొత్తం చెల్లించి రసీదు పొందాలని, అట్లు చెల్లించని యెడల వారు కట్టిన ధరావత్తును అపరాధము కింద దేవస్థానం అకౌంటుకు జమ కట్టుకొని తిరిగి వేలం నిర్వహించబడునన్నారు. పర్మిషన్ వచ్చిన వెంటనే చెట్లు తొలగించవలెనన్నారు. ఇతర షరతులు వేలమునకు ముందుగా తెలపబడునని ఆలయ ఈఓ కొండారెడ్డి తెలియజేశారు.

# జగనన్న రక్ష...ఆరోగ్య సురక్ష



రైల్వేకోడూరు రూరల్, అక్టోబరు 25 ప్రభాతవార్త

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు జగనన్న రక్ష... ఆరోగ్య సురక్ష ఏర్పాటు చేసి అందరి జీవితాలతో వెలుగులు నింపాలనే ఉద్దేశ్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక మండలంలోని విపిఆర్ కండ్రికలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలురకాల స్టాల్స్‌ను ఏర్పాటు చేసి ఎమ్మెల్యే ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతిఒక్కరు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు రామిరెడ్డి ధ్వజారెడ్డి, సుదర్శన్‌రాజు, సుధాకర్‌రాజు, మండలానికి చెందిన వైసిపి ప్రముఖులు పాల్గొన్నారు.

# వేంపల్లెలో అంగరంగ వైభవంగా వాసవిమాత గ్రామోత్సవం



వేంపల్లె, అక్టోబరు 25, ప్రభాతవార్త :

వేంపల్లెలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి పూలతొట్టిలో శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవి గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాయవరం సురేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా వేంపల్లె పట్టణ పురవీదుల్లో మొబైల్ ఆర్కెస్ట్రా, కీలు గుర్రాలు, తప్పెట్లు, గుంతకల్ బ్యాండ్, బాణసంచా, తదితర ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం, వాసవి కల్యాణ మండప కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# వ్యవస్థల్ని మేనేజ్ చేసి చంద్రబాబును అరెస్టుచేయడం అసాంఘికం

తెదేపా జాతీయనేత కిశోర్‌కుమారర్‌రెడ్డి

పీలేరు, అక్టోబరు 25 ప్రభాతవార్తః



వ్యవస్థల్ని మేనేజన్ చేసి చంద్రబాబు అక్రమ అరెస్టు చేయడం అసాంఘికమని న్యాయాన్ని నిర్బంధించడమేనని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ బాధ్యులు నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఎలాంటి నేర నిరూపణ కాకుండా కేవలం రాజకీయ కక్షతో 46 రోజులుగా జ్యుడీషియల్ రిమాండులో ఉంచడం మోసపూరిత ప్రభుత్వ ఎత్తులను చిత్తుచేసి ఆఖరికి నిజాయితీ గెలుస్తుందని న్యాయస్థానాలపై మాకు నమ్మకం ఉందన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని చంద్రబాబు పర్యటన సందర్భంగా ఆయన కార్యక్రమానికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక పీలేరు, పుంగనూరు, మదనపల్లె, తంభళ్లపల్లె, నియోజకవర్గాల్లో తెదేపా నాయకులు, కార్యకర్తలపై ఏడు వందల మందిపై సెక్షన్ 307 కేసులు నమోదుచేయడం దారుణమని మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిపై కిశోర్‌కుమార్‌రెడ్డి విరుచుకుపడ్డారు. రాజకీయంగా ఎదుర్కోలేక తెదేపా శ్రేణులపై తప్పుడు కేసులు పెట్టడం తగదని హితవు పలికారు.

# డిసెంబరు 15 నాటికి జిల్లాలో ఇంటింటికి వంద శాతం కుళాయి కనెక్షన్లు ఇవ్వాలి

– జిల్లా కలెక్టర్ గిరీష పీఎస్



రాయచోటి, అక్టోబరు 25, ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జల్ జీవన్ మిషన్ పథకం అమలులో భాగంగా డిసెంబరు 15 నాటికి జిల్లాలో ఇంటింటికి వంద శాతం కుళాయి కనెక్షన్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీష పీఎస్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జల్‌జీవన్ మిషన్ పథకం అమలుపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాలను బాధ్యతాయుతంగా పూర్తి చేయాలని ఆయన తెలిపారు. కేటగిరి వారీగా లక్ష్యాలను సాధించి అన్నమయ్య జిల్లాను అగ్రపథాన నిలపాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సీవీ ప్రసన్నకుమార్, ఈఈలు, డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కేవి.సుబ్బారావును సన్మానించిన ఆవోపా కమిటి



బద్వేలు అర్బన్, అక్టోబర్ 25 ప్రభాతవార్త :

దసరా ఉత్సవాలను ప్రొద్దుటూరుకు ధీటుగా బద్వేలు పట్టణంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కేవి.సుబ్బారావు, సెక్రటరి కొలిశెట్టి నాగరాజతోపాటు పలువురు కమిటి సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం పట్ల బుధవారం ఆవోపా కమిటి సెక్రటరీ జొన్నలగడ్డ సుధాకర్ , ట్రెజరర్ పత్తి రాఘవేంద్రరావు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ బచ్చు సురేష్, శ్రీ సాయి వెంకటేశ్వర లాడ్జి పబ్బతి హజరత్, గొల్లమందల వేణుగోపాల రామక్రిష్ణ, పత్తి రాములతో పాటు పలువురు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలమాలలో కేవి.సుబ్బారావును ఘనంగా సత్కరించారు. గత 4 సంవత్సరాల లో అధ్యక్షులుగా ఉంటూ కే.వి.సుబ్బారావు కమిటి గతంలో ఎన్నడూలేని విధంగా దాతల సహకారంతో నిరుపేద వైశ్యులకు వ్యాపారాలు చేసుకొనుటకు అనువుగా వాసవి కాంప్లెక్స్ ఏర్పాటు చేయడమే కాకుండా గతంలో వడ్డీలేని రుణాలు, కరోనా మహమ్మారి సమయ ంలో అనేకమంది వైశ్యులకు అనేక రకాల సదుపాయాలను కల్పించారన్నారు. ఈ సంవత్సరం దసరా ఉత్సవాలను కూడా అత్యంత వైభవంగా నిర్వహించి బద్వేలు ప్రాంత ప్రజల మన్నన్నలను పొందారని పలువురు కమిటి సభ్యులకు, అధ్యక్షులకు అభినందనలు తెలిపారు. రాబోవు రోజుల లో కూడా నిరుపేద ఆర్యవైశ్యులకు చేయూత నిచ్చే లక్ష్యంతో ముందుకు రావాలని వారు ఆకాంక్షించారు.

# కన్నుల పండుగగా అమ్మవారికి పుష్పయాగం

వాల్మీకిపురం, అక్టోబరు 25 ప్రభాతవార్తః



శ్రీశోభకత నామ సంవత్సరం దేవీ నవరాత్రి ఉత్సవాలు ముగింపును పురస్కరించుకుని స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో బుధవారం అమ్మవారికి వివిధ రకాల పుష్పాలతో అమ్మవారికి పుష్పయాగం నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో నిత్యసేవలో అనంతరం మంగళవాయిద్యాల నడుమ ఎదురు గంపల్లో వివిధ రకాల పుష్పాలను తీసుకుని వాల్మీకి క్షేత్రంలోని నాలుగు మాఢవీధుల్లో ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య వివిధ రకాల పుష్పాలతో అమ్మవారిని అబిషేకించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శివకుమార్ స్వామి, తిమ్మరుసు సుదీర్ స్వామి, శీనాస్వామి, ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులు ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# బస్టాండు నిర్మాణానికి భూమిపూజ

సుండుపల్లె, అక్టోబరు 25 ప్రభాతవార్తః



మండల కేంద్రంలో 1.40 ఎకరాల్లో బస్టాండ్ నిర్మానానికి సుండుపల్లె వైఎస్సార్‌సీపీ నాయకులు భూమి పూజచేశారు. చాలా ఏళ్లుగా మండల కేంద్రంలో బస్టాండు సౌకర్యం లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో బస్టాండు మంజూరు కావడం ఆనందంగా ఉందని వైఎస్సార్‌సీపీ నాయకులు అజయ్‌రెడ్డి, గాలివీటి విజయసాగర్ రెడ్డి, ఏపీ టూరిజం రాష్ట్ర డైరెక్టర్ అజంత రాణిలు స్పష్టం చేశారు. యర్రపురెడ్డి అజయ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన భూమిపూజ కార్యక్రమంలో టూరిజం డైరెక్టర్ యర్రపురెడ్డి, అజంతరాణి, మాజీ జడ్పీటీసీ యర్రపురెడ్డి జయమ్మ, మండల కన్వీనర్ యర్రపురెడ్డి ఆనందరెడ్డి, వైసీపీ నాయకులు మధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మదన్‌రెడ్డి మాట్లాడుతూ బస్టాండు నిర్మాణం కోసం వైసీపీ నాయకులు అజయ్‌రెడ్డి స్థలం కొనుగోలు చేసి విరాళంగా ఇచ్చారన్నారు. ఎంపీ మిథున్ రెడ్డి తన నిధుల నుంచి బస్టాండు నిర్మాణానికి రూ.20లక్షలు మంజూరు చేశారన్నారు. బస్టాండు నిర్మాణం కోసం గతలో ఎంపీ గారిని కోరడం జరిగిందని, వైసీపీ ప్రభుత్వం రాగానే బస్టాండు నిర్మానానికి చొరవ చూపుతానని హామీ ఇచ్చారని హామీ మేరకు ఇప్పుడు అడిగిన వెంటనే మంజూరు చేశారని తెలిపారు. బస్టాండు నిర్మాణం కోసం అనువైన స్థలం కావాలని ఎమ్మెల్యే మల్లికార్జునరెడ్డి కోరిన వెంటనే అజయ్‌రెడ్డి బస్టాండు కోసం స్థలం కొనుగోలు చేసి విరాళంగా ఇవ్వడం జరిగిందన్నారు. బస్టాండు మంజూరుకు కషిచేసిన ఎమ్మెల్యే మల్లికార్జునరెడ్డి, జడ్పీ ఛైర్మన్ అమర్నాథరెడ్డిలకు కతజ్ఞతలు తెలిపారు. ముహూర్తం బాగుగా ఉండటం ఎంపీ మిథున్‌రెడ్డి ఆదేశాలతో నేడు భూమి పూజ చేయడం జరిగిందని, త్వరలోనే ఎమ్మెల్యే జడ్పీ ఛైర్మన్, ఎంపీ వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డిలతో శిలాఫలకంతో శంకుస్థాపన మరింత ఘనంగా చేస్తామని వివరించారు. ఈకార్యక్రంలో సర్పంచి ,ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# లారీ, బొలెరో వాహనం ఢీ

– డ్రైవర్లకు గాయాలు

సంబేపల్లె, అక్టోబరు 25, ప్రభాతవార్త:



మండల పరిధిలోని కర్నూలు–చిత్తూరు జాతీయ రహదారి మోటకట్ల వెంకట శివ సాయి ఆలయం ఎదురుగా బుధవారం లారీ, బొలెరో వహనం ఢీకొన్న ప్రమాదంలో లారీ, బొలెరో వాహనాల డ్రైవర్లు నాగప్ప, దిలీప్‌కుమార్‌లకు గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాకు చెందిన నాగప్ప కడప నుంచి చెన్నై ఎయిర్ పోర్టుకు బొలెరో వాహనంలో వెళ్తుండగా మహారాష్ట్ర విరాట్‌నగర్‌కు చెందిన దిలీప్‌కుమార్ లారీ డ్రైవర్ పీలేరు వైపు నఉంచి కడప వైపు వెళ్తుండగా మోటకట్ల శివాలయం వద్ద ఎదురుగా ఢీకొనడంతో బొలెరో వాహనం నుజ్జు నుజ్జు అయింది. స్థానికులు వీరిని ప్రైవేటు వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుని కాలుకు తీవ్రగాయాలు

బద్వేలు అర్బన్, అక్టోబర్ 25 ప్రభాతవార్త :



ద్విచక్రవాహనంపై వెళ్తున్న శివ అనే యువకుడిని నెల్లూరుకు చెందిన ఆర్టీసీ డిపో బస్సు ఢీకొన్న ఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాలలోకెళితే పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన శివ అనే యువకుడు ద్విచక్ర వాహనం పై వెళ్తుండగా నెల్లూరు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో శివ కాలుకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే సీమాంక్ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు ప్రథమ చికిత్స చేశారు. మెరుగైనవైద్యం కోసం కడపకు తరలించారు.